
ప్రజాశక్తి

బుధవారం 27 నవంబర్ 2024

5

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు





'ఆధార్' తప్పనిసరి : సబ్ కలెక్టర్

ప్రజాశక్తి - లింగసముద్రం: ఆధార్ కార్డు లేని వారందరూ వెంటనే ఆధార్ కార్డులను తీసుకోవాలని కందుకూరు సబ్ కలెక్టర్ తిరుమణి శ్రీ పూజ చెప్పారు. మంగళవారం మండల కేంద్రమైన లింగసముద్రంలోని సచివాల యం -1 ఎదురుగా ఉన్న ఎస్‌టి కాలనీ వాసులతో మాట్లాడారు. ఆమె వెంట ఎంపిడిఒ కట్ట శ్రీనివాసులు, మండల తెలుగు యువత అధ్యక్షులు అడపా రంగయ్య,పంచాయతీ కార్యదర్శులు మాదవరం శ్రీహరి ఉన్నారు.



ఎస్‌టి కాలనీవాసులతో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్

గుడ్లూరు :గుడ్లూరు లోని సచివాలయం ఒకటో కేంద్రంలో ఏర్పాటుచేసిన ప్రత్యేక ఆధార్ క్యాంపు కార్యాలయంలో పలువురు పాఠశాల విద్యార్థులకు నూతన ఆధార్ కార్డులు మంజూరు చేశారని ఆధార్ ఎన్రోల్మెంట్ అధికారి హరినాద్ తెలిపారు. ఆధార్ కార్డులో మార్పులు చేర్పులు చేసి స్పెల్లింగ్ లో తేడాలు లేకుండా చూడటం జరిగిందని బయోమెట్రిక్ ఒంటి సాంకేతిక లోపాలను సరి చేయటం జరిగిందని ఎంపిడిఒ వై వెంకటేశ్వరరావు తెలిపారు.

కర్షకులు.. కార్మికులు.. కన్నెర్ర..!

◆పంటలకు మద్దతు ధర చట్టం తేవాలి.. లేబర్ కోడ్ బిల్లులను రద్దు చేయాలి..

◆సంయుక్త కిసాన్ మోర్చా, కేంద్ర కార్మిక సంఘాల ఐక్యవేదిక డిమాండ్ -కలెక్టరేట్ వద్ద భారీ ధర్నా

సంయుక్త కిసాన్ మోర్చా, కేంద్ర కార్మిక సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో మంగళవారం కదం తొక్కారు. కర్షకులు, కార్మికుల సమస్యలను పరిష్కరించాలని నినదించారు. జోరు వానలో కలెక్టరేట్ వద్ద జరిగిన భారీ ధర్నాలో రైతు, కార్మిక సంఘాల నేతలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలను తూర్పారబట్టారు.



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న నాయకులు

ప్రజాశక్తి-నెల్లూరు :డాక్టరు ఎం.ఎస్ స్వామినాథన్ కమిటీ సిఫార్సు చేసిన విధంగా పంటల ఉత్పత్తి వ్యయానికి అదనంగా 50 శాతం కలిపి పండించిన పంటకు మద్దతు ధర అమలు చేయాలని, అందుకోసం మద్దతు ధర చట్ట తేవాలని సంయుక్త కిసాన్ మోర్చా, కేంద్ర కార్మిక సంఘాల ఐక్యవేదిక నాయకత్వం డిమాండ్ చేసింది. మంగళవారం నగరంలో రైతులు, కార్మికులు భారీ స్థాయిలో గాంధీబొమ్మ నుండి కలెక్టరేట్ వరకు భారీ ప్రదర్శన చేపట్టారు. జోరు వర్షం కురుస్తున్నా లెక్కచేయకుండా రైతులు, కార్మికులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ప్రదర్శన చేపట్టారు. కలెక్టరేట్ ఎదుట నిర్వహించిన ధర్నాలో సంయుక్త కిసాన్ మోర్చా, కేంద్ర కార్మిక సంఘాల ఐక్యవేదిక సమన్వయ కమిటీ జిల్లా కన్వీనర్ మాలి వెంగయ్య మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఒక కలం పోటుతో రాజ్యాంగం కల్పించిన అనేక చట్టాలను కాలరాస్తూ పాలన సాగిస్తున్నాయన్నారు. ఎన్‌డిఎ ప్రభుత్వం తీసుకొచ్చిన నల్ల చట్టాలు అమలు చేయడం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతారని రైతాంగం పెద్దఎత్తున ఉద్యమించడంతో ప్రభుత్వం ఆ ఆలోచనను ఉపసంహరించుకుంటున్నామని ప్రకటించిందన్నారు. అయితే చాపకింద నీరులాగా తాము రూపొందించిన నల్ల చట్టాలను అమలు చేసేందుకు కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నాయన్నారు. ఎన్నికల హామిలను విస్మరించాయన్నారు. రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి జి.సునీత మాట్లాడుతూ రైతు ఆత్మహత్యలను నివారించేందుకు చర్యలు తీసుకోకపోవడం సిగ్గుచేటన్నారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.అజయ్‌కుమార్ మాట్లాడుతూ కరోనా అవకాశంగా తీసుకున్న బిజెపి ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు దేశాన్ని అప్పనంగా అప్పజెప్పేందుకు కుట్రపూరితంగా పాలన సాగిస్తుందని విమర్శించారు.రాజ్యాంగ విలువలను కాలరాసే విధంగా కేంద్ర ప్రభుత్వ పాలన ఉందని వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ఎం.పుల్లయ్య విమర్శించారు. ప్రభుత్వం నామమాత్రంగా రైతులు పండించిన పంటకు మద్దతు ధర ప్రకటిస్తుందే కాని, ప్రకటించిన మద్దతు ధర రైతుకు అందజేసిన దాఖలాలు లేవని ఏపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి గంగపట్నం రమణయ్య పేర్కొన్నారు. సిఐటియు నాయకులు జి.నాగేశ్వరరావు, కత్తి శ్రీనివాసులు, కె.పెంచల నర్సయ్య, అల్లాడి గోపాల్, కాయంబు శ్రీనివాసులు, గోగుల శ్రీనివాసులు మూలం ప్రసాద్,పి.సూర్యనారాయణ, మారుబోయిన రాజా, అల్లంపాటి శ్రీనివాసులరెడ్డి,ఆవాజ్ జిల్లా కమిటీ నాయకులు షేక్ రషీద్,ఎం.అశోక్ పాల్గొన్నారు.



కందుకూరు సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-కందుకూరు : రాష్ట్ర ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ మంగళవారం సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట జరిగిన ధర్నాలో సిఐటియు జిల్లా కార్యదర్శి జి వెంకటేశ్వర్లు, ఎఐటియుసి, నాయకురాలు రమణమ్మ మాట్లాడారు. కార్మికుల హక్కులను కాలరాసే నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలన్నారు. లేదంటే కార్మిక వర్గం ప్రతిఘటిస్తుందని ప్రభుత్వానికి హెచ్చరిక చేశారు. కనీస వేతనం రూ 26,000 ఇవ్వాలని, కాంట్రాక్టు కార్మికులను రెగ్యులర్ చేయాలని సిఐటియు జిల్లా నాయకులు జి వి కుమారు, ఎఐటియుసి నాయకులు వై ఆనంద మోహన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ధర్నాకు సిఐటియు పట్టణ కార్యదర్శి ఎస్ కె సల్మా, ఎఐటియుసి పట్టణ అధ్యక్షులు మురళి అధ్యక్ష వర్గంగా వ్యవహరించారు. ధర్నా అనంతరం సబ్ కలెక్టర్ కార్యాలయం ఏఓకి వినతి పత్రం అందజేశారు. రైతులకు స్వామినాథన్ కమిషన్ సిఫార్సు మేరకు అయిన ఖర్చులు తోపాటు 50శాతం అదనంగా మద్దతు ధరగా నిర్ణయించాలని, రైతుల ఆత్మహత్యల నివారణకు కేరళ రాష్ట్రం తరహాలో రైతు రుణ ఉపశమన చట్టం దేశవ్యాప్తంగా అమలు చేయాలని, తదితర డిమాండ్లను వినతిపత్రంలో పేర్కొన్నారు. సిఐటియు జిల్లా నాయకులు ఎస్ ఎ గౌస్, డి రామ్మూర్తి, కొట్టే వెంకయ్య, రైతు సంఘం నాయకులు మాదాల రమణయ్య, దామా కిష్టయ్య, మహిళా సంఘం నాయకులు సుంకర విజయలక్ష్మి, పట్టణ సిఐటియు నాయకులు బి వెంకట్రావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు దువ్వూరి జాన్, ప్రజా నాట్యమండలి నాయకులు పాలకుర్తి నాగేశ్వరరావు,ఎఐటియుసి నాయకులు ఉప్పుటూరి మాధవరావు, బాల బ్రహ్మచారి, మున్సిపల్ వర్కర్లు, ఎద్దు కొండమ్మ, రమణమ్మ, బండి మరియమ్మ, మల్లేశ్వరి, ఈశ్వరమ్మ, కోటేశ్వరరావు ఉన్నారు.

జగన్, అదానీలపై కేసు ఎందుకు పెట్టరు..?

◆మోడీ, చంద్రబాబు రక్షిస్తున్నారు..

◆బాబు, జగన్ విధానాలు ఒక్కటే

◆సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు



మాట్లాడుతున్న సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బి.వి రాఘవులు

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి :విద్యుత్ ఒప్పందాల్లో భారీ అవినీతికి పాల్పడిన మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై ఎందుకు కేసు పెట్టలేదని సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు అన్నారు. మంగళవారం నెల్లూరు సిపిఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు మారారు తప్ప, ఇంకేమి మారినట్లు కనిపించడం లేదన్నారు. అప్పుడు చక్రం తిప్పిన అధికారులందరూ ఒకరిద్దరు మినహా అందరూ అదే పనిచేస్తున్నారని, జగన్‌మోహన్‌రెడ్డి వద్ద అదాని ఒప్పందాలు చేసుకున్నారన్నారు. చంద్రబాబు వద్ద ఆ ఒప్పందాన్ని అదాని కొనసాగిస్తున్నారన్నారు. అప్పుడు అధికారులు, అప్పటి కాంట్రాక్టర్లు ఇప్పుడూ ఉన్నారన్నారు. ప్రభుత్వంలో ఏమీ మార్పు రాలేదన్నారు. అదాని రూ.1750 కోట్లు జగన్ సిఎంగా ఉన్నప్పుడు ఇచ్చి రాష్ట్ర ప్రజలపై భారీగా పనులు పడే విధంగా ఏడు వేల మెగావాల్ట్ సౌరవిద్యుత్‌కు సంబందించి సెక్కితో ఒప్పందం కుదుర్చుకున్నారని తెలిపారు. అదాని నుంచి జగన్ ముడుపులు పొందారని, లక్ష కోట్లు భారం పడే ప్రమాదకరమైన ఒప్పందాన్ని సిఎంగా ఉన్న చంద్రబాబునాయుడు ఎందుకు రద్దు చేసుకోవడం లేదన్నారు. గతంలో సెక్కితో ఒప్పందం చేసుకునే సమయంలో సిపిఎం వ్యతిరేకించిందని, టిడిపి ఏం చెప్పలేదని గుర్తు చేశారు. అదాని నుంచి ముడుపులు తీసుకున్న జగన్‌మోహన్‌రెడ్డిని రక్షిస్తున్నా రన్నారు. అయితే అదానిని విమర్శించడం లేదన్నారు. జగన్ అవినీతి, రాష్ట్రాన్ని ధ్వంసం చేశారని, కోట్ల రూపాయలు దోచుకున్నారని చెబుతున్నా ఇప్పటికీ అధ్యయనం చేస్తున్నాని చంద్రబాబు చెబుతున్నారన్నారు. ఇప్పటికే పత్రికలు, అమెరికా అధ్యయనం చేసిందన్నారు. సెక్కితో ఒప్పందాన్ని టిడిపి రద్దు చేయాలని, 1.90 పైసలు మార్కెట్ ఉందని, అప్పుడు రూ. 2.49పైసలకు ఒప్పందం చేసుకున్నారని, అప్పటికీ, ఇప్పటికీ సౌర విద్యుత్ ధరలు తగ్గాయన్నారు. ఆ ఒప్పందాన్ని ఎందుకు కొనసాగించాలని ప్రశ్నించారు. మన రాష్ట్రంలో ఏడు వేల మెగావాల్ట్ తీసుకొని 30 సంవత్సరాలు ప్రజలు బాధపడ్డాల్సి వస్తుందన్నారు. రాష్ట్రాన్ని సోలరైజేషన్ చేస్తామని చంద్రబాబు చెబుతున్నారని, ఇంటింటికి, ప్రతి ప్రభుత్వ కార్యాలయాల్లో ఏర్పాటు చేస్తే, మరి ఏడు వేల మెగావాల్ట్ విద్యుత్ ఎందుకన్నారు. రూ.1750 కోట్లు అవినీతికి పాల్పడి, ప్రజలపై భారాలు మోపిన జగన్‌మోహన్‌రెడ్డిని ఎందుకు ఉపేక్షిస్తున్నారని, చంద్రబాబునాయుడు ఆయనకు సహకరిస్తున్నారని విమర్శించారు. ఇసుక, బియ్యం అవినీతి పరులపై పిడి యాక్ట్ పెడతామని అసెంబ్లీలో చెప్పారని, పెద్ద పెద్ద అవినీతి పరులను ఎందుకు వదిలేస్తారన్నారు. ప్రధాని మోడీ చిన్న చిన్న వ్యక్తులపై ఇడి, సిబిఐ, వంటి సంస్థలను ప్రయోగించారని, ఇక్కడ ఎందుకు మౌనంగా ఉన్నారన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి విషయంలో ప్రధాని మోడీ, సిఎం చంద్రబాబు నాయుడు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదన్నారు. ముగ్గురు మంచి దోస్తులని విమర్శించారు. ఎక్కడో అమెరికాలో కేసు నమోదు చేస్తే, ఇక్కడ ఎందుకు చేయడం లేదో చెప్పాలన్నారు. వెంటనే జగన్, అదానిలపై రాష్ట్ర ప్రభుత్వం కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. చంద్రబాబునాయుడు, మోడీ, ఎందుకు మూగనోము పడుతున్నారన్నారు. అందరూ అదాని ముందు మోకరిస్తున్నారన్నారు. పోలవరంపై చంద్రబాబుకు తాను ఒక్క ఉత్తరం రాశానని, ప్రస్తుతం ఉన్న డయాఫాం వాల్ పాడైపోయిందని, కొత్త దానిని నిర్మించాలని కోరారని, పాత దానికి రూ. వెయ్యి కోట్లు ఖర్చు చేశారన్నారు. కొత్తదాని కోసం మరో రూ. వెయ్యి కోట్లు ఖర్చు అవుతుందన్నారు. దీనికి ఎవరు బాధ్యత వహిస్తారన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి లేదా కాంట్రాక్టర్లు బాధ్యులెవరైనా ఏం చర్యలు తీసుకుంటారన్నారు. అదే కాంట్రాక్టర్లను కొనసాగిస్తున్నారని, జగన్‌పై చర్యలు తీసుకోవడం లేదన్నారు. చంద్రబాబు నాయుడు బయటకు విమర్శలు చేస్తున్నారని, కాంట్రాక్టర్‌ను, జగన్ మోహన్‌రెడ్డిని రక్షించే పనిచేస్తున్నారని విమర్శించారు. ఉక్కు పరిశ్రమ ఏర్పాటులో మిట్టల్ కంపెనీ అనకాపల్లి జిల్లాలో పెడుతామని చెప్పారని, విశాఖలో ఉన్న పరిశ్రమను నడిపించకుండా ఇలా కొత్త పేర్లు తీసుకొస్తున్నారన్నారు. వెనుకపడిన ప్రాంతమైన కడప. ప్రకాశం జిల్లాలలో ఏర్పాటు చేయాలని కోరారు. విలేకర్ల సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం. మోహన్‌రావు పాల్గొన్నారు.

పూడిక తీత పనులు పరిశీలన

గుడ్లూరు రూరల్ :మండలంలోని చెంచిరెడ్డిపాలెంలో జరుగుతున్న పంట కాలువ పూడిక తీత పనులను ఎంపిడిఒ వెంకటేశ్వరరావు, తహశీల్దార్ స్వర్ణ. పరిశీలించారు. వారి వెంట సిబ్బంది ఉన్నారు.

ప్రజా సమస్యలకు పరిష్కారం :ఇంటూరి

ప్రజాశక్తి -ఉలవపాడు :ఉలవపాడు మండల పరిషత్ కార్యాల యంలో మంగళవారం నాడు కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు మండల స్థాయి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశానికి అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు. నాగేశ్వరావు మాట్లాడుతూ మండల ప్రజల నుంచివచ్చే అర్జీలను పరిశీలించి త్వరితగదన పరిష్క రించాలని అధికారులకు సూచించారు.ఎంపిడిఒ విజయ, తహశీల్దార్ లావణ్య, మండల టిడిపి అధ్యక్షులు రాచగల్లు సుబ్బారావు ఉన్నారు.

ప్రజల రాకపోకలకు చర్యలు : ఎంపిడిఒ

ప్రజాశక్తి -గుడ్లూరు రూరల్ :మండలంలోని రావూరు ప్రజల రాకపోకలకు చర్యలు తీసుకుంటామని ఎంపిడిఒ వెంకటేశ్వరరావు తెలిపారు. మండలంలోని రావూరు గ్రామానికి వెళ్లే రైల్వే బ్రిడ్జి కింద నీరు నిలిచి ఉండటంపై ప్రజాశక్తిలో కథనం వచ్చింది.



దీనిపై స్పందించిన ఆయన రావూరు రైల్వే అండర్ పాస్‌ను మంగళశారం పరిశీలించారు. నీరు నిలిచి ఉండటంపై రైల్వే ఉన్నతాధికారులతో మాట్లాడిన ఆయన సమస్య తీవ్రతను ఉన్నతా ధికారులకు వివరించారు.

కోరం లేక సమావేశం వాయిదా..

ప్రజాశక్తి - లింగసముద్రం :స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో మంగళవారం మండల సర్వసభ్య సమావేశం మధ్యాహ్నం 3 గంటలకు ప్రారంభం కావాల్సి ఉండగాకోరం కాకపోవడంతో వాయిదా వేస్తున్నట్లు మండల పరిషత్ అధ్యక్షులు పెన్నా కష్ణయ్య ప్రకటించారు. సర్వసభ్య సమావేశం ఉండడంతో మండల స్థాయి అధికారులు సిబ్బంది కార్యాలయానికి వచ్చారు.సమావేశాన్ని ప్రారంభించేందుకు అధ్యక్షులు సమావేశపు హాల్లోకి వచ్చి 4.15 నిమిషాల వరకు వేచి చూశారు. 11 మంది ఎంపిటిసిలకు గానూ ఎంపిపితో కలిపి ఇద్దరే సమావేశానికి హాజరయ్యారు.దీంతో కోరం లేకపోవడంతో సమావే శాన్ని వాయిదా వేస్తున్నట్లు అధ్యక్షులు కష్ణయ్య చెప్పారు.



పంటల సాగుపై అవగాహన

ప్రజాశక్తి-కందుకూరు : కందుకూరు మండలంలోని మోపాడు , మాచవరం గ్రామాల్లో మండల వ్యవసాయాధికారి వి రాము ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. రాము, ప్రకృతి వ్యవసాయ అధికారి డి. దనమ్మ, ప్రకతి వ్యవసాయ మోడల్ మేకర్ పి మాధవ మాట్లాడారు. మోపాడులో వరి నాట్లు పొలాలను పరిశీలించారు. మాచవరంలో కూరగాయల పంటలను పరిశీలించారు. మార్కెటింగు సూపర్ వైజర్ షేక్ ఖాసిం ఉన్నారు.



వలేటివారిపాలెంలో..

వలేటివారిపాలెం: వలేటివారిపాలెం మండలంలోని శామీర్ పాలెం, పోలినేనిపాలెం గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఎం హేమంత్ భరత్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కందుకూరి వ్యవసాయ సబ్ డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు డాక్టర్ పి అనసూయ పాల్గొన్నారు. రైతులకు పలు సూచనలు చేశారు. పోలినేనిపాలెం ఎంపిటిసి చింతలపూడి రవీంద్ర, గ్రామ సర్పంచ్ అనుముల అమరేశ్వరి పాల్గన్నారు.

గుడ్లూరు రూరల్ :పరకొండపాడు, పురేటిపల్లి రైతు సేవా కేంద్రాల పరిధిలోని గ్రామాల్లో మండల వ్యవసాయ అధికారి బి. రవికుమార్ అధ్యక్షతన పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు.

చెమిడిదిపాడుకు విగ్రహం

గుడ్లూరు రూరల్ :గుడ్లూరు మండలం. చెమిడిదపాడు బస్టాండు వద్ద నిర్మాణంలో ఉన్న అంజనేయ స్వామి ఆలయం వద్దకు మహాబలిపురంలో తయారు చేయించిన మూల విరాట్ విగ్రహం మంగళవారం చేరుకుంది. మహా బలిపురం నుంచి ఆలయ ట్రస్ట్ అధ్యక్షుడు ఆలూరి వెంకట హనుమంతరావు,హనుమాన్ దీక్షా గురుస్వామి హనుమత్ ప్రసాద్, విగ్రహ దాత వర్ధినేని ప్రభాకరరావు గారి జ్ఞాపకార్థం వారి 3 వ కుమార్తె నల్లమోతు మురళి, హను మంతరావు,బాల హరిప్రియ, వర్ధినేని అజయ్ బాబు ప్రత్యేక ఇక్కడికి తీసుకొచ్చారు. ఒంటె వాహనం , గణపతి, సుబ్రమణ్య స్వామి వారి విగ్రహాలను తీసుకొచ్చినట్లు ఆలయ ట్రస్ట్ అధ్యక్షుడు హనుమంతరావు తెలిపారు.

'నారాయణ' x 'కోటంరెడ్డి'..!

-పేదల వద్ద పన్నులను పీడిస్తే సహించను ..

-అధికారులకు అల్టిమేటం

-మా నియోజకవర్గంలో జరగనివ్వనని హెచ్చరిక..

టిడిపి నేతలు గతంలో జగన్‌మోహన్‌రెడ్డి చెత్తపన్ను వేస్తే నానా హంగామా చేశారు. చెత్త ముఖ్యమంత్రి. ..పేదలను పన్నులతో హింసిస్తారా ? అంటూ గగ్గోలు పెట్టారు.. ఇప్పుడు అధికారంలోకి వచ్చిన వెంటనే మంత్రి పి.నారాయణ అదేశాలతో నెల్లూరు కార్పొరేషన్ అధికారులు జనం నుంచి ముక్కుపిండి పన్నులు వసూళ్లు చేయడానికి సిద్ధమయ్యారు. దీనిపై నెల్లూరు రూరల్ ఎంఎల్ఎ కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ నియోజకవర్గంలో ప్రజలను ఇబ్బంది పెట్టి పన్నులు వసూళ్లు చేస్తే సహించనని హెచ్చరించారు. అవసరమైతే ఉద్యమం చేస్తామని అల్టీమేటం ఇచ్చారు. అధికారపార్టీ ఎంఎల్ఎ జనం తరపున మాట్లాడినా మంత్రి నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్నారని తెలుస్తోంది. ఈ విషయంలో మంత్రి పి.నారాయణ, ఎంఎల్ఎ కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి మధ్య నువ్వా నేనా అన్నట్లు మారింది.. ఇప్పటికే పన్నుల భారంపై సిపిఎం నిరసన తెలిసింది.



కార్పొరేషన్ అధికారులతో మాట్లాడుతోన్న కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

ఏరుదాటే వరకు ఏరు మల్లన్న....ఏరుదాటాక బోడి మల్లన్న అన్నచందంగా ఉందని మంత్రి పి. నారాయణ వ్యవహార్శైలి. నిన్నటి వరకు కార్పొరేషన్‌లో ఏ చిన్న పన్ను వేసినా ప్రజలను ఇబ్బంది పెట్టొద్దని మాట్లా డారు. జగన్ మోహన్‌రెడ్డి చెత్తపన్ను విధిస్తే నానా మాటల న్నారు. ఇప్పుడు అదికారంలోకి వచ్చిన వెంటనే కూటమి నేతలు గత ప్రభుత్వాన్ని మించి భారాలు మోపడానికి సిద్ధమైంది. కార్పొరేషన్‌లో అభివృద్ధి కార్యక్రమాలు జరగాలంటే ప్రజలు పన్నులు సకాలంలో చెల్లించాలి. దీనిని ఎవరూ అభ్యంతరం పెట్టరు. కొందరు బడా రాజకీయనేతలు, వ్యాపారులు, బిల్డర్లు, పన్నులు చెల్లించకుండా ఉన్నారు. ఇలాంటి వారి నుంచి కార్పొరేషన్ అధికారులు ఇప్పుడు వసూలు చేయాల్సిందే. దీనిని పక్కన పెట్టి కార్పొరేషన్‌కు చెల్లించాల్సిన ఇంటి, కుళాయి, ఆస్తి, ఖాళీ స్థలం, ఇలా అనేక రకాల పన్నులు పెంచి, వసూళ్ల చేయాలని మంత్రి పి.నారాయణ ఇటీవల సమావేశం ఏర్పాటు చేసి, అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. నగరంలో సుమారు 160 మురికివా డలున్నాయి. నగరం చుట్టుపక్కల శివారు ప్రాంతాల్లో పేద, మధ్య తరగతి ప్రజలు నివాసముంటున్నారు. వీరందరి నుంచి ఏదొక రూపంలో పన్నులు విధించి, బలవంతంగా వసూళ్ల చేయడానికి సిద్ధమవుతున్నారు. ఒక వేళ పన్నులు చెల్లించకుంటే ఇంటికి కరెంట్, నీటి కనెక్షన్, బజార్లో డప్పు వేయించడం వంటి చర్యలకు దిగుతున్నారు. అ నిర్ణయంతో ప్రజలు ఆగ్రహంతో ఉన్నారు. ఇప్పటికే సిపిఎం నిరసన వ్యక్తం చేసింది. పోరాటానికి సిద్ధమవుతోంది.ప్రజల్లో తీవ్ర భయం దోళనలున్నాయి. మంత్రి ఆదేశాలతో కార్పొరేషన్ అధికారులు రంగంలోకి దిగారు. కూటమి ప్రభుత్వ విధానాలపై తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది.

నా దగ్గర కుదరదు...

మంత్రి పి.నారాయణ నిర్ణయాన్ని ఎంఎల్ఎ కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. అభివృద్ధి జరగాల్సిందేనని, ప్రజలను భయపెట్టి, ఇబ్బంది పెట్టి చేయాల్సిన అవసరం లేదని ఆయన అంటున్నారు. మంగళవారం కార్పొరేషన్ అధికారులతో ఆయన ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. మా నియోజకవర్గంలో ఎందరో పేద ప్రజలు నివాసముంటున్నారని, వారిని బలవంతంపెట్టి పన్నులు వసూళ్ల చేస్తే సహించనని అధికారులను హెచ్చరించారు. సామాన్య, పేద, మధ్య తరగతి ప్రజలు అప్పులు చేసి ఇళ్ల నిర్మాణాలు చేసుకుంటే వారిపై పన్నులు దండుకుంటారా ? అంటూ ప్రశ్నిస్తున్నారు. మా నియోజకవర్గంలో మీ నిర్ణయాలు పనిచేయవని, అవసరమైతే పోరాటం చేస్తానని అల్టిమేటం ఇచ్చారు. మున్సిపల్ చట్టాలు ఉంటాయని, వాటిని అమలు చేయాలని సొంత చట్టాలు తీసుకురావద్దని సున్నితంగా చెప్పారు. ఓవైపు ఆశాఖ మంత్రి నారాయణ జనం నుంచి పన్నులు వసూళ్ల చేయాలని చెబుతుంటే మరో ఎంఎల్ఎ మా నియోజకవర్గంలో జరగనివ్వనని చెప్పడంతో అధికారులు అయోమయంలో పడ్డారు. మంత్రి నారాయణ నిర్ణయానికి వ్యరేకతంగా శ్రీధర్‌రెడ్డి మాట్లాడినా ప్రజల తరపున, వారికి అనుకూలంగా మాట్లాడడం పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అధికారపార్టీలో ఉండి మంత్రి నిర్ణయాన్ని తప్పుపట్టిన ఆయన భవిష్యత్తులో ఎలా వ్యవహరిస్తారో చూడాలి.

పాటూరులో చేనేత క్లస్టర్ ఏర్పాటు చేయండి : విపిఆర్

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి :నెల్లూరు పార్లమెంట్ పరిధిలోని కోవూరు నియోజకవర్గంలోని పాటూరులో స్మాల్ క్లస్టర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంలో భాగంగా ప్రత్యేక క్లస్టర్ ఏర్పాటు చేయాలని నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి కేంద్ర జౌళిశాఖ మంత్రి గిరిరాజ్ సింగ్‌కు విన్నవించారు. మంగళవారం కేంద్రమంత్రి ఛాంబర్‌లో ఆయన్ను మర్యాదపూర్వకంగా కలిసిన ఎంపి వేమిరెడ్డి ఈ సందర్భంగా ఆయన్ను శాలువాతో సత్కరించారు. అనంతరం పాటూరులో క్లస్టర్ ఏర్పాటు చేయాల్సిన ఆవశ్యకతను కేంద్రమంత్రికి వివరించారు.

'సాకేష్‌కు పరామర్శ'

ప్రజాశక్తి -నెల్లూరు ప్రతినిధి :టిడిపి నేతలు తమ కార్యకర్తలపై దాడులకు పాల్పడుతున్నారని, దీనిని ఎట్టి పరిస్థితుల్లోనూ సహించమని వైసిపి జిల్లా అధ్యక్షులు కాకాణి గోవర్ధన్‌రెడ్డి, ఎంఎల్‌సి పి.చంద్రశేఖర్‌రెడ్డి అగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం స్థానిక బాలాజీ నగర్ లో నివసిస్తున్న సాకేష్ ఇంటికి వెళ్లి పరామర్శించారు. దాడి సంఘటన వివరాలను అడిగి తెలుసుకున్నారు. కాకాణి గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ వైసిపి కాంగ్రెస్ పార్టీ యువజన విభాగ నాయకుడు "సాకేష్" పై జరిగిన దాడి అమానుషమన్నారు.

వేమిరెడ్డి కృషితో పీజీ సీట్లు

ప్రజాశక్తి -నెల్లూరు ప్రతినిధి :నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి కృషి ఫలితంగా నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి ప్రభుత్వ మెడికల్ కాలేజీలో జనరల్ సర్జరీ విభాగాల్లో పోస్టు గ్రాడ్యుయేషన్‌కు సంబంధించి 5 కొత్త సీట్లు కేటాయిస్తూ కేంద్ర వైద్యారోగ్య శాఖ ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు నెల్లూరు మెడికల్ కళాశాలకు సమాచారం అందించింది. నెల్లూరు మెడికల్ కళాశాలలో 2024-25 సంవత్సరానికి సంబంధించి కాలేజీలో ఆర్థోపెడిక్, జనరల్ సర్జరీకి సంబంధించి పీజీ సీట్లు కేటాయించాలని ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఆగస్టు 29వ తేదీన నేషనల్ మెడికల్ కమిషన్ ఛైర్మన్ బి.ఎన్ గంగాధర్‌కి ఢిల్లీలో కలిసి వివరించారు.

పలుచోట్ల రాజ్యాంగ దినోత్సవ వేడుకలు

ప్రజాశక్తి-కందుకూరు : స్థానిక .టిఆర్.ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రాజనీతి శాస్త్ర విభాగం ఎన్.ఎస్.ఎస్ ఆధ్వర్యంలో మంగళవారం రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన తెలుగు అధ్యాపకులు డాక్టర్ కే.సుజాత మాట్లాడారు. రాజ్యాంగ విలువలు, లక్ష్యాల గురించి విద్యార్థులకు వివరించారు. ఇంకా సాధికారత విభాగం అధ్యక్షురాలు షేక్ షహనాజ్ బేగం, రాజనీతి శాస్త్ర అధ్యాపకులు కోటపాటి నరేష్ రాజా మాట్లాడారు. పిడి కె. కరుణ రత్నకుమార్, ఉర్దూ అధ్యాపకులు మెహబూబ్ బాషా, హిందీ అధ్యాపకులు రాఘవరావు ఉన్నారు. కందుకూరు వైసిపి కార్యాలయంలో కార్యాలయంలో 75వ రాజ్యాంగ ఆమోద దినోత్సవం నిర్వహించారు. వక్తలు మాట్లాడుతూ పేద బడుగు వర్గాల కోసం అంబేద్కర్ ఎంతగానో శ్రమించారు. వైసిపి నాయకులు ముప్పవరపు కిషోర్,గణేశం. గంగిరెడ్డి ,బిల్లా రమణయ్య, షేక్ రహీం, కూరపాటి వెంకట్రామిరెడ్డి, తల్లపనేని గోపి, రేణమాల.అయ్యన్న, జంగిలి ఇస్రాయిలు ,వాక శ్రీనివాసరెడ్డి ,గల్లా వెంకటేశ్వర్లు షేక్ బికారి,తలారి ప్రసన్నకుమారి ,దేవరకొండ ఆదిలక్ష్మి ఉన్నారు.

టిఆర్ఆర్ జూనియర్ కళాశాలలో..

టిఆర్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రాజ్యాంగ దినోత్సవ వేడుకలు జరిగాయి. కళాశాల చరిత్ర అధ్యాపకుడు కట్టా సుబ్బారావు ప్రారంభ ఉపన్యాసం చేశారు..కళాశాల ప్రిన్సిపల్ ఓరుగంటి వెంకటేశ్వరరావు మాట్లాడారు.అధ్యాపకులు మస్తాన్వలి, బాబురావు, కాశీరత్నం,రాజశేఖర్, నర్సింహారావు,ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ హజరత్తయ్య,ఉష,షాలిమ, శిరీష,సీతారామమ్మ మాధవి క్యాథరిన్, చాముండేశ్వరి ఉన్నారు.

గుడ్లూరు రూరల్ :గుడ్లూరు మండల పరిధిలోని పూరేటి పల్లిలోని ఉన్న గ్రంధాలయంలో మంగళవారం రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించారు. డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో గ్రంధపాలకులు చవలం చెన్నయ్య మాట్లాడారు.

రెవెన్యూ సమస్యలను పరిష్కరించండి.

ప్రజాశక్తి - లింగసముద్రం : స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో మంగళవారం జరిగిన సమీక్ష సమీక్షలో ఎంఎల్ఎ ఇంటూరి నాగేశ్వరరావు పాల్గొన్నారు. ఎంఎల్ఎ మాట్లాడుతూ అధికారులు ప్రజా సమస్యలను, ముఖ్యంగా మండలంలో రెవెన్యూ సమస్యలు త్వరితగతిన పరిష్కరిం చాలన్నారు. గత వైసిపి ప్రభుత్వం అధికారం ఉన్నప్పుడు ఈ మండలంలో జల జీవన్ మిషన్ కార్యక్రమంలో అనేక అక్రమాలు జరిగాయని, వాటిపై విచారణ జరిపి బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవడంతోపాటు తిన్న అవినీతి సొమ్మును తిరిగి ప్రభుత్వానికి జమ చేసేలా చేస్తానని ఎంఎల్ఎ తెలిపారు. ఎంపీడీవో కట్టా శ్రీనివాసరావు ఎమ్మార్వో శ్రీనివాసులు,ఇతర మండల అధికారులు,తెలుగుదేశం బిజెపిజనసేన పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంఎల్ఎ

కార్యకర్తలకు అండగా టిడిపి : ఇంటూరి

ప్రజాశక్తి-కందుకూరు : కార్యకర్తల సంక్షేమానికి టిడిపి అండగా నిలుస్తుందని ఎంఎల్ఎ ఇంటూరి నాగేశ్వరరావు పేర్కొన్నారు. 3వ వార్డుకు చెందిన కందుకూరి బాలమణికంఠ ఇటీవల ఉప్పు చెరువు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించారు. కందుకూరు ఆర్యవైశ్య సామాజిక వర్గానికి చెందిన బాల మణికంఠ తెలుగుదేశం పార్టీ క్రియాశీలక కార్యకర్త. గతంలో పార్టీ సభ్యత్వ నమోదు చేయిం చుకున్నాడు.దీంతో ఆయన కుటుంబానికి రూ. 2 లక్షల ఆర్థిక సాయం వచ్చేలా ఇంటూరి నాగేశ్వరరావు కృషి చేశారు. ఈ మేరకు బాల మణికంఠ కుటుంబానికి ప్రమాద బీమా నగదును బ్యాంకు అకౌంట్లో జమ చేశారు. ఈ నేపథ్యంలో ఎంఎల్ఎ కార్యాలయంలో బాల మణికంఠ కుటుంబ ఎంఎల్ఎ నాగేశ్వరరావును కలిసి మంగళవారం ధన్యవాదములు తెలిపారు.కొత్తూరి వెంకట సుధాకర్ మోదడుగు వెంకటేశ్వర్లు, ఇమ్మడిశెట్టి సుబ్బరాయుడు, ఉమామహేశ్వరరావు ఉన్నారు.



మాట్లాడుతున్న ఎంఎల్ఎ ఇంటూరి నాగేశ్వరరావు

ఐఎఫ్‌సి ఫౌండేషన్ చేయూత

ప్రజాశక్తి-కందుకూరు :పట్టణానికి చెందిన అబ్దుల్ రెహమాన్ అనే వద్ధుడు నడుము కింద భాగంలో ఒక చిన్న ఆపరేషన్ కోసం ఆర్థికపరమైన అవసరం కోసం ఐఎఫ్సి ఫౌండేషన్ వారిని సంప్రదించగా ఫౌండేషన్ వారు దాతల నుండి స్వీకరించిన విరాళాలతో ఒంగోలులో శ్రీరామ్ మల్టీ సూపర్ స్పెషాలిటీ ఆపరేషన్‌ను చేయించారు.ఈ నేపథ్యంలో ఆపరేషన్‌కు సహాయం అందించడానికి మొదటి అడుగు వేసిన చీదెళ్ల వేణుగోపాల్‌కి, ఐఎఫ్‌సి ఫౌండేషన్‌కు రెహమాన్ ధన్యవాదలు తెలిపారు.

ఎంఎల్ఎను సత్కరించిన టిడిపి నాయకులు

ప్రజాశక్తి - లింగసముద్రం :స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో జరిగిన సమావేశంలో పాల్గొన్న ఎంఎల్ఎ ఇంటూరి నాగేశ్వరరావును విశ్వనా ధపురం గ్రామ సర్పంచ్ బొల్లినేని నాగేశ్వరరావు, యర్రారెడ్డిపాలెం తెలుగుదేశం పార్టీ నాయకులు రాజారపు మాలకొండయ్య, చినపవని టిడిపి నాయకులు సోంపల్లి మనోహర్ శాలువాతో సత్కరించారు.



ఎంఎల్ఎ సన్మానిస్తున్న మాలకొండయ్య. మనోహర్

విద్యార్థులకు స్క్రీనింగ్ పరీక్షలు

ప్రజాశక్తి -గుడ్లూరు :గుడ్లూరులోని ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు స్క్రీనింగ్ పరీక్షలో నిర్వహించినట్లు వైద్య అధికారిని ఎస్.కె సబిహాసుల్తానా తెలిపారు. మంగళ ాారం నిర్వహించిన ప్రత్యేక వైద్య శిబిరంలో సుమారు 290 మంది విద్యార్థులకు ఎత్తు, లావు, రక్తహీనత పై పరీక్షలు నిర్వహించారు. ఎఎన్ఎంలు వై సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలపై ఉద్యమించాలి : సిపిఐ


ప్రజాశక్తి-నెల్లూరు :భారత రాజ్యాంగాన్ని పరిరక్షించండి నరేంద్ర మోడీ చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను పైఉద్యమించండి సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వరరావు పిలుపు మంగళవారం నగరంలోని సిపిఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు.. కేంద్రంలోని బిజెపి నాయకత్వంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం భారత రాజ్యాంగాన్ని పూర్తిగా పక్కన పెట్టే విధంగా ప్రయత్నం చేస్తున్నదని అందుకు నిదర్శనమే అమెరికా ప్రభుత్వం ఆదాని పై కేసు నమోదు కావడమన్నారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బి జగదీష్., సిపిఐ జిల్లా కార్యదర్శి దామా అంకయ్య మాట్లాడారు. నల్ల చట్టాలను తీసుకొచ్చి రాజ్యాంగాన్ని తమా కనుకూలంగా మార్చు కోడాన్ని తప్పు పట్టారు. సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి మాల కొండయ్య, నెల్లూరు నగర కార్యదర్శి అరిగెల నాగేంద్ర సాయి, నగర సహాయ కార్యదర్శి సయ్యద్ సిరాజ్ పాల్గొన్నారు.

పారిశ్రామిక వేత్తలతో ఎంఎల్ఎ కాకర్ల




ప్రజాశక్తి-ఉదయగిరి : అమెరికా పారిశ్రామికవేత్తలతో కలిసి మంత్రి నారా లోకేష్‌ను ఎంఎల్ఎ కాకర్ల సురేష్ కలిశారు. మంగళవారం అమరావతిలోని మంత్రి నివాసంలోని క్యాంప్ కార్యాలయంలో ఐటి శాఖ మంత్రి నారా లోకేష్‌ను పారిశ్రామికవేత్తలు విమల్ కుమార్ కొలప్ప సాయి కిరణ్ కొలవెన్ను ఎంఎల్ఎ కాకర్ల సురేష్‌తో కలిసి మర్యాద పూర్వకంగా కలసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా శాసనసభ్యులు కాకర్ల సురేష్ పిలుపుమేరకు అమెరికాలోని ర్యాలై, నార్త్ కరోలినా, ప్రాంతాలకు చెందిన పారిశ్రామికవేత్తలు విమల్ కుమార్ కొలప్ప, సాయికిరణ్ కొలవెన్ను, ఉదయగిరి నియోజకవర్గంలో పెట్టుబడులు పెట్టేందుకు ఆదివారం నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటించారు. ఈ నేపథ్యంలో మెట్టప్రాంతంలో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి కనబరిచారు. ఈ సందర్భంగా మంత్రి నారా లోకేష్ బాబు మాట్లాడుతూ ఆగ్రో ఫామ్స్ ఏర్పాటుకు అన్నివిధాల సహకరిస్తామని తెలిపారు. అనంతరం ఎంఎల్ఎ కాకర్ల సురేష్ మంత్రి నారా లోకేష్‌కు మెట్ట ప్రాంత ప్రజలు తరుపున అభినందనలు తెలియజేశారు.

చేనేత క్లస్టర్‌కు నిధులు మంజూరు చేయండి



ప్రజాశక్తి-కోవూరు : నెల్లూరు పార్లమెంట్ పరిధిలోని కోవూరు నియోజకవర్గంలో ఉన్న పాటూరులో స్మాల్ క్లస్టర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ (ఎస్‌సిడిపి)లో భాగంగా ప్రత్యేక క్లస్టర్ ఏర్పాటు చేయాలని ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి కేంద్ర జౌళిశాఖ మంత్రి గిరిరాజ్ సింగ్‌కు విన్నవించారు. మంగళవారం కేంద్రమంత్రి ఛాంబర్‌లో ఆయన్ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన్ను శాలువాతో సత్కరించారు. పాటూరులో గ్రామంలో 500 చేనేత కుటుంబాలు పూర్తిగా చేనేత వృత్తిపై ఆధారపడి జీవిస్తున్నాయన్నారు. ఇక్కడ ప్రత్యేక క్లస్టర్ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని, స్మాల్ క్లస్టర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ అంచనా వ్యయం రూ.76.320 లక్షలని తెలిపారు. పాటూరు స్మాల్ క్లస్టర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం (ఎస్‌సిడిపి) ప్రతిపాదనలు అంగీకరించి మొదటి విడత నిధుల మంజూరుకు సహకరించాలని కేంద్ర మంత్రికి విజ్ఞప్తి చేశారు. ఈ విషయమై కేంద్రమంత్రి సానుకూలంగా స్పందించారు. ప్రతిపాదనను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

తలసేమియా వ్యాధి పీడితులకు రక్తమార్పిడి



ప్రజాశక్తి-కావలి : ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ డే కేర్ సెంటర్‌లో మంగళవారం ముగ్గురు తలసేమియా వ్యాధి పీడితులకు రక్తమార్పిడి నిర్వహించారు. ఈ సందర్భంగా రెడ్‌క్రాస్ రక్తకేంద్రం కన్వీనర్ డాక్టర్ బెజవాడ రవికుమార్ మాట్లాడారు. కార్యక్రమంలో రక్త మార్పిడి చేయించుకున్న ప్రభాకర్, మల్లికార్జున, సయ్యద్ రిహానేలకు మందులు, పోషక విలువ ఫలాలు అందించి, భోజన ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో తలసేమియా ఆస్పత్రి ప్రదాతగా రమేష్ రెడ్డి, వైద్యులు డాక్టర్ శ్రీధర్, డాక్టర్ రమ్య, తలసేమియా డే కేర్ సెంటర్ నిర్వహణ కమిటీ కన్వీనర్ కె.హరినారాయణ రెడ్డి, సభ్యులు కల్లయ్య, సాయికుమార్, జమున, రెడ్‌క్రాస్ ప్రతినిధులు డి రవిప్రకాష్, కలికి శ్రీహరిరెడ్డి, రాజేంద్ర, నల్లూరి రవికుమార్, గోపికృష్ణ, ఇస్మాన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

రైతులకు అవగాహన



ప్రజాశక్తి-వరికుంటపాడు : మండల కేంద్రమైన వరికుంటపాడు పొగాకు బోర్డు ఆధ్వర్యంలో రైతులకు మంగళవారం బోర్డు వేలం నిర్వహణ అధికారి జి.రాజశేఖర్ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత సంవత్సరం లో గ్రేడ్ రావటానికి చాలా కారణాలున్నాయని, నాణ్యమైన పొగాకును పండించడానికి మెలకువలు తెలియజేశారు. కార్యక్రమంలో ఏ.జి.ఓ మేనేజర్ వెంకటేష్, ఫీల్డ్ ఆఫీసర్ ఆదర్శ్ జగన్నాథ్, కెనరా బ్యాంక్ మేనేజర్ చంద్రశేఖర్, రైతు నాయకులు అంగ నాగిరెడ్డి, ఆంథ్ర శివరామిరెడ్డి, పొగాకు బోర్డు సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



'మాగుంట'కు నివాళులు

ప్రజాశక్తి-కావలి : కావలి ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిన మాగుంట సుబ్బరామిరెడ్డి అని, కావలి ఎంపీడీవో దగుమాటి వెంకట కృష్ణారెడ్డి తెలిపారు. దివంగత ఎంపి మాగుంట సుబ్బరామిరెడ్డి 77వ జయంతి కార్యక్రమం ఆర్‌టిసి బస్టాండ్ వద్ద ఉన్న ఆయన విగ్రహం వద్ద టిడిపి పట్టణ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌ఏ పాల్గొని సుబ్బరామిరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సేవ చేయాలనే దృఢ సంకల్పంతో రాజకీయాల్లోకి వచ్చి, ఒంగోలు పార్లమెంట్ సభ్యునిగా సుబ్బారామిరెడ్డి గెలుపొందా రన్నారు. వెంగళరావు నగర్ నుండి పేదవాళ్ళు నివసించే అనేక కాలనీల్లో టాంకర్ల ద్వారా త్రాగునీరు అందించే వారని తెలిపారు. పట్టణ టిడిపి అధ్యక్షులు గుత్తికొండ కిషోర్ బాబు, ప్రధాన కార్యదర్శి జ్యోతిబాబూరావు, గుంటుపల్లి రాజ్ కుమార్ చౌదరి, పట్టణ తెలుగు మహిళ అధ్యక్షురాలు అల్లియా బేగం, నాయకులు, మాగుంట అభిమానులు పాల్గొన్నారు.

టవర్ పరికరాలు తీసేయాలి



ప్రజాశక్తి-కావలి : రిలయన్స్ సంస్థ వారు తన ఇంటిపై టవర్ నిర్మించి, ఈ బిల్డింగ్ టవర్ నిర్మాణానికి అనుకూలంగా లేదని తెలిపి 8 సంవత్సరాలుగా ఆ టవర్ తొలగించకుండా తనను వేధిస్తున్నారని బాధితుడు జె.శ్రీనివాసులు ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం ఆయన పట్టణంలోని స్థానిక జర్నలిస్ట్ క్లబ్‌లో మీడియా సమావేశం నిర్వహించి మాట్లాడుతూ తన ఇల్లు వెంగళరావు నగర్‌లోని శివాలయం వీధిలో ఉందని, రిలయన్స్ సంస్థ వారు ఇంటిపై జియో టవర్‌ను పెట్టాలని సంప్రదించి తన బిల్డింగ్‌పై టవర్ నిర్మాణం చేపట్టారన్నారు. 2016లో సైట్ నెంబర్ 002 పెట్టారన్నారు. అనంతరం వారు 8 నెలలు ఉండి ఆ తరువాత మీ బిల్డింగ్ దానికి అనుకూలంగా లేదని చెప్పి ఆ టవర్ తీసి బిల్డింగ్ పైన ఉన్న రాడ్స్ వాటి పరికరాలు మాత్రం అలానే ఉంచేశారన్నారు. వాటిని తొలగించాలని 7 సంవత్సరాలుగా తిరుగుతున్నా వారు పట్టించుకోవడం లేదని దాని మూలంగా బిల్డింగ్ నెర్రలు బట్టి స్లాబ్ పెచ్చులు పడుతున్నాయన్నారు. ఈ టవర్ వల్ల ఏ ప్రమాదం జరిగినా రిలయన్స్ సంస్థ వారే బాధ్యులు అవుతారన్నారు. ఈ టవర్ వల్ల తనకు రూ.30లక్షలు నష్టం వాటిల్లిందన్నారు. బిల్డింగ్‌పై టవర్ పరికరాలు తొలగించకపోతే చాలా ప్రమాదం జరుగుతుందని అధికారులు సహకరించి, ఆ టవర్‌ను ఆ సంస్థ ద్వారా తొలగించేలా చర్యలు తీసుకోవాలని కోరుకుంటున్నట్లు తెలియజేశారు.

దుస్తులు అందజేత

ప్రజాశక్తి-కావలి : హ్యాపీ సేవాసంస్థ ఆధ్వర్యంలో మంగళవారం ముసునూరు మరిరెడ్డి కొత్త గిరిజన కాలనీలోని గిరిజనులకు వస్త్రదానం చేశారు. ముఖ్య అతిథిగా కావలి వ్యవసాయశాఖ (ఏ.డి) సహాయ సంచాలకులు నాగరాజు హ్యాపీ సేవాసంస్థ సభ్యులు చేస్తున్న మంచి కార్యక్రమాలు ఎంతో బాగున్నాయని వారు చేస్తున్న సేవలను కొనియాడారు. హ్యాపీ సేవా సంస్థ అధ్యక్షులు సయ్యద్.ఘనిబాషా మాట్లాడుతూ విశ్వదయ బాలికోన్నత పాఠశాలలో వాచ్‌మెన్‌గా విధుల నిర్వహించిన షేక్.మీరాసాహెబ్ 21వ వర్ధంతి సందర్భంగా వారి కుమారుడు షేక్.మస్తాన్ సాహెబ్ (బుజ్జి) దాతృత్వంతో ఈ కార్యక్రమం నిర్వహించామన్నారు. లోక్ అదాలత్ సభ్యులు ఎం.మాలకొండారెడ్డి, హ్యాపీ సేవాసంస్థ సలహాదారులు చేపూరు ప్రభయ్య, ఉపాధ్యక్షులు విజయ్.దేవరకొండ, తదితరులు సేవలందించారు.

పోలీసులకు అవగాహన

ప్రజాశక్తి-ఉదయగిరి : అరెస్ట్, రిమాండ్‌లతో కోర్టుల్లో నిందితుల హాజరుపై ఉదయగిరి జూనియర్ సివిల్ కోర్టు అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎన్ సుకన్య పోలీసులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మంగళవారం ఆమె మాట్లాడుతూ నేరస్తులను అరెస్ట్ చేసిన సమయంలో పోలీసులు చట్టానికి లోబడి తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరిస్తూ అవగాహన కల్పించారు. ఉదయగిరి సిఐ వెంకట్రావు, ఎస్‌ఐ కర్నాటి ఇంద్రసేనారెడ్డి, దుత్తలూరు, సీతారామపురం, వరికుంటపాడు, వింజమూరు ఉదయగిరి ఎస్‌ఐలు, కోర్టు కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

నియామక పత్రాలు అందజేత

ప్రజాశక్తి-కోవూరు : కోవూరులో జరిగిన జాబ్‌మేళాలో ఉద్యోగం అవకాశాలు కల్పించిన నియామక పత్రాలను జిల్లా అధికారి అబ్దుల్ ఖయ్యూమ్ అందజేశారు. 92మంది సభ్యులు హాజరు కాగా 39మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ప్రభుత్వ డిగ్రీకళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మీనారాయణ, జిల్లా నైపుణ్యాభివృద్ధి ఆఫీసర్ అబ్దుల్ ఖయ్యూం ఎంపికైన వారికి నియామక పత్రాలు అందజేసి అభినందనలు తెలియజేశారు.

'పొలం పిలుస్తోంది'

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : రైతులు సకాలంలో సస్యరక్షణ పద్ధతులు పాటించాలని సహాయ వ్యవసాయ సంచాలకులు వి.దేవసేనమ్మ అన్నారు. వెంకట్రావు పల్లి, మురగళ్ల గ్రామాల్లో మంగళవారం 'పొలం పిలుస్తోంది' నిర్వహించారు. వ్యవసాయ కిషోర్ బాబు, వివిఎ సిహెచ్ సస్య, ఎంపిఇఒ ఇంద్రాణి పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ విధానాలపై వామపక్షాల నిరసన



ఆత్మకూరు ఆర్‌డిఒకు వినతినిస్తున్న నాయకులు

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

డాక్టర్ స్వామినాథన్ కమిషన్ సిఫార్సులను అమలు చేయాలని, 4 లేబర్ కోడ్‌లను రద్దుచేసి కార్మిక చట్టాలను పునరుద్ధరించాలని సిఐటియు జిల్లా నాయకులు జి వి శివప్రసాద్ అన్నారు. మంగళవారం సంయుక్త కిసాన్ మోర్చా, కార్మిక సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో సుమారు 120 మంది కార్మికులు మున్సిపల్ బస్టాండ్ అంబేద్కర్ విగ్రహం వద్ద నుండి ఆర్‌డిఒ కార్యాలయం వరకు పెద్దఎత్తున ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా నాయకులు జి వి శివప్రసాద్, జిల్లా కౌలు రైతుసంఘం నాయకులు గంటా లక్ష్మీపతి, సిఐటియు మండల అధ్యక్ష కార్యదర్శులు కొండమూరి హజరత్తయ్య, ఆత్మకూరు నాగయ్య మాట్లాడుతూ దేశవ్యాప్త కార్యాచరణలో భాగంగా రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని డాక్టర్ స్వామినాథన్ కమిషన్ సిఫార్సులను అమలు చేయాలని, అన్ని రకాల పంటలకు కనీస మద్దతు ధరకు చట్టం చేయాలన్నారు. నాలుగు లేబర్ కోడ్‌లను రద్దుచేసి కార్మిక చట్టాలను పునరుద్ధరించాలన్నారు. ఇప్పటికీ అన్ని పంటలకు కనీసం మద్దతు ధరను చట్టం చేయలేదని, స్వామినాథన్ సిఫార్సు అమలు చేస్తానని చెప్పిన, ప్రధాని ఆ సిఫార్సును తుంగలో తొక్కి వ్యవసాయాన్ని కూడా కార్పొరేట్ చేతులు పెట్టే ప్రయత్నం చేస్తున్నాడని విమర్శించారు. అనంతరం ఆర్‌డిఒకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి షేక్ అన్వర్, బి.రత్నయ్య, ఎం.ఓంకార్, సిఐటియు మండల నాయకులు డేవిడ్ రాజు, అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి పి.రాధమ్మ, ఎల్ఐసి యూనియన్ నాయకులు జాన్ ప్రభాకర్, ఎస్‌డబ్ల్యుఎఫ్ జిల్లా నాయకులు ఎస్.కె.మహమ్మద్ అలీ, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు గురవయ్య, ఆశావర్కర్ల యూనియన్ కార్యదర్శి బి.రమణమ్మ, హెల్త్ యూనియన్ నాయకులు పి.జిలాని, శ్రామిక మహిళా సంఘం నాయకురాలు, ఎస్.కె గుల్జార్ బేగం, తదితరులు పాల్గొన్నారు.



బీమా ఉద్యోగులు నిరసన : ఆల్ ఇండియా ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయిస్ యూనియన్ ఇచ్చిన పిలుపు మేరకు ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయిస్ యూనియన్ ఐసిఇయు బ్రాంచ్ యూనిట్ ఆత్మకూరులో మంగళవారం మధ్యాహ్నం భోజనం విరామ సమయంలో కిసాన్ మోర్చా కేంద్ర కార్మిక సంఘాల ఐక్యవేదికకు మద్దతుగా నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా బ్రాంచ్ కార్యదర్శి శ్యామ్ ప్రభాకర్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికులపై మొండివైఖరి విడనాడాలన్నారు. కార్యక్రమంలో బ్రాంచ్ యూనియన్ అధ్యక్షులు టి.రమేష్, జాయింట్ సెక్రెటరీ రమాదేవి, వైస్ ప్రెసిడెంట్ జి.సాయితేజ, నందగోపాల్, ఉద్యోగులు పాల్గొన్నారు.



కావలిలో...

ప్రజాశక్తి-కావలి : కేంద్ర సంయుక్త కిసాన్ మోర్చా, కార్మిక సంఘాల ఐక్యవేదిక ఇచ్చిన పిలుపుమేరకు మంగళవారం కావలిలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ వామపక్ష పార్టీలకు చెందిన కార్మిక, కర్షక, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో పట్టణంలో ఏరియా ఆస్పత్రి వద్ద నుండి ప్రదర్శనగా బయలుదేరి కోర్టు సెంటర్, శ్రీ పొట్టి శ్రీరాములు బొమ్మ, మీదుగా తిరిగి ఉదయగిరి బ్రిడ్జి కూడలి వరకు భారీర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు పసుపులేటి పెంచలయ్య, ఎఐటియుసి జిల్లా ఉపాధ్యక్షులు చిన్ని రాజగోపాల్ మాట్లాడుతూ కేంద్రంలో ఎన్‌డిఎ ప్రభుత్వం కార్మిక ప్రజా వ్యతిరేక పాలన సాగిస్తుందన్నారు. రైతు నాయకులు బలిజేపల్లి వెంకటేశ్వర్లు, గడ్డం మాల్యాద్రి మాట్లాడారు. కార్యక్రమంలో వ్యకాసం నాయకులు టి.మాల్యాద్రి, రైతు సంఘం నాయకులు రావి మాల్యాద్రి, సిపిఐ నాయకులు దర్గాబాబు, సిఐటియు నాయకులు తురక శీను, ఎం పోలయ్య, బి.మహేష్, ఒంగోలు రమేష్, ఎఐటియుసి నాయకులు మల్లి.అంకయ్య, ఎండ్లూరి.ఆదినారాయణ, రావినూతల వెంకటేశ్వర్లు, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.



ఉదయగిరిలో..

ప్రజాశక్తి-ఉదయగిరి : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా సిపిఎం ప్రాంతీయ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం, సిఐటియు, రైతుసంఘం నాయకులు కోడె రమణయ్య, కాకు వెంకటయ్య మాట్లాడారు. అనంతరం తహశీల్దార్ ఎం.సుభద్రకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు రజియా, మండల అధ్యక్షులు గడ్డం నాగేశ్వరరావు, అంగన్‌వాడీ ప్రాజెక్టు అధ్యక్షురాలు ప్రమీల, ఎంపిటిసి కాకు విజయ, సిపిఎం, సిఐటియు, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.



బాల్య వివాహాలను అరికట్టాలి

ప్రజాశక్తి-అల్లూరు : మండల పరిధిలోని చెర్లోసంఘంలో మంగళవారం ఐసిడిఎస్ సిబ్బంది ఆధ్వర్యంలో బాల్యవివాహాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసిడిఎస్ సిడిపిఒ కె.సౌజన్య మాట్లాడుతూ బాల్యవివాహాలను ప్రోత్సహించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, బాల్య వివాహాలు అరికట్టడంలో ప్రతిఒక్కరు భాగస్వామ్యం కావాలని తెలియజేశారు. బాల్య వివాహాల నిర్మూలనకు టోల్ ఫ్రీ నెంబర్ 1098కు ఫోన్ చేసి బాల్య వివాహాలు నిర్మూలించాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంపిడిఒ రజినీకాంత్, ఇఒపిఆర్‌డి పెంచల వీరేంద్ర, ఐసిడిఎస్ సూపర్ వైజర్లు రాజేశ్వరి, అసావర్కర్ పద్మ, అంగన్‌వాడీ టీచర్స్ రాణి, మహిళా పోలీసు, తదితరులున్నారు.

104 ఉచిత వైద్య సేవలు



ప్రజాశక్తి-మర్రిపాడు

రాజుపాలెం గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో మర్రిపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ గోపీనాథ్ ఆధ్వర్యంలో 104 వాహనం ద్వారా ఉచిత వైద్య సేవలు అందించారు. రోగులను పరీక్షించి వారికి అవసరమైన మందులు పంపిణీ చేశారు. పాఠశాల విద్యార్థులకు ఆరోగ్యకర మైన అలవాట్లు, పరిశుభ్రత, సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. వైద్య, ఆరోగ్య సహాయకులు నాగిరెడ్డి, ఎఎన్ఎం వేళాంగణి, ఆశా కార్యకర్తలు ఉమారాణి, తిరుపతమ్మ, తదితరులున్నారు.

'రాగాల'కు డాక్టరేట్ ప్రదానం



ప్రజాశక్తి-కోవూరు : విక్రమ సింహపురి యూనివర్సిటీ కావలి క్యాంపస్ వాణిజ్య విభాగానికి చెందిన పరిశోధకుడు రాగాల రమణయ్యకు విక్రమ సింహపురి యూనివర్సిటీ పిహెచ్‌డి డిగ్రీ పట్టా ప్రదానం చేసింది. రాగల రమణయ్య (డెవలప్‌మెంట్ ఆఫ్ మేనేజీరియల్ పర్సనల్ ఇన్ సెలెక్ట్ మ్యానుఫాక్చరింగ్ ఇండస్ట్రీస్ ఆఫ్ ఎస్‌పిఎస్ఆర్ నెల్లూరు డిస్ట్రిక్ట్) అనే అంశంపైన పరిశోధన చేసినందుకు గాను రమణయ్యకు విక్రమ సింహపురి యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. రాగాల రమణయ్య చిన్నతనం నుండి చదువు అంటే ఎంతో మక్కువతో డిగ్రీ మాస్టర్ డిగ్రీ ఎంబిఎ పూర్తి చేసి విక్రమ సింహపురి యూనివర్సిటీలో ఆర్ సెట్‌లో మంచి ర్యాంక్ సాధించి ప్రొఫెసర్ ఎం.చంద్రయ్య ఆధ్వర్యంలో పరిశోధన చేసి మంచి పరిశోధకుడుగా పేరు తెచ్చుకున్నారు. రాగాల రమణయ్యకు విక్రమ సింహపురి యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసినందుకు చాలా ఆనందంగా ఉందన్నారు. రమణయ్యకు సహాయ సహకారాలు అందించిన కావలి క్యాంపస్ వాణిజ్య విభాగానికి కాలేజీ, ప్రిన్సిపాల్‌కు వాణిజ్య విభాగాధిపతికి, ప్రియమైన గైడ్ ఎం.చంద్రయ్యకు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. రాగల రమణయ్య మాట్లాడుతూ ఇంకా పెద్ద చదువులు చదువుతానని పోస్ట్ డాక్టోరల్ పీహెచ్ డిగ్రీ సాధించడమే తన జీవిత లక్ష్యమన్నారు.

అధికారులతో ఎంపిడిఒ సమీక్ష

ప్రజాశక్తి-అనంతసాగరం : మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఎ.ఇ. హౌసింగ్, ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో మంగళవారం ఎంపిడిఒ విజయ్ ప్రవీణ్ సమావేశం నిర్వహించారు. సచివాలయ సిబ్బంది అందరు కచ్చితంగా బయోమెట్రిక్ హాజరు నమోదు చేయాలని, ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు బయోమెట్రిక్ హాజరు ప్రకారం జీతాలు సిబ్బందికి చెల్లించబడతాయన్నారు.

పీజీ కాలేజీలో ఆటలపోటీలు



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న విసి

ప్రజాశక్తి-కావలి : కావలి విక్రమసింహపురి యూనివర్సిటీ పి.జి. కళాశాలలో మంగళవారం వి.ఎస్. యూనివర్సిటీ అంతర్ కళాశాల గేమ్స్ టోర్నమెంట్లను ఘనంగా నిర్వహించారు. ఈ పోటీలను యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ఎస్.విజయభాస్కర్‌రావు ప్రారంభించారు. ఈ టోర్నమెంట్‌లో వాలీబాల్, బాల్ బ్యాడ్మింటన్, టగ్ ఆఫ్ వార్ ఆటలను నిర్వహించారు. రిజిస్ట్రార్ డాక్టర్ కె.సునీత, స్పోర్ట్స్ బోర్డ్ సెక్రటరీ డాక్టర్ వెంకటేశ్వర్లు, యూనివర్సిటీ ఫర్ స్టేజ్ గేమ్స్ అబ్జర్వర్ డాక్టర్ బి.ప్రసాద్ రెడ్డి, జవహర్ భారతి కళాశాల ఫిజికల్ డైరెక్టర్ ఆర్గనైజింగ్ సెక్రటరీ మతుకుల ప్రారంభ కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించి ప్రారంభించారు. టగ్ ఆఫ్ వార్‌లో గవర్నమెంట్ డిగ్రీ కాలేజీ వెంకటగిరి, ఫైనల్‌కు చేరుకుంది. బాల్ బ్యాడ్మింటన్‌లో జవహర్ భారతి డిగ్రీ కాలేజీ ఫైనల్‌కి చేరుకుంది. వాలీబాల్‌లో జవహర్ భారతి డిగ్రీ కాలేజ్ ఫైనల్‌కు చేరుకుంది. కార్యక్రమంలో యూనివర్సిటీ పరిధిలోని 15 డిగ్రీ, పి.జి. కళాశాలల నుండి 300 మంది క్రీడాకారులు పాల్గొన్నారు.

జిఒ 73ను అమలు చేయాలి

ప్రజాశక్తి-జలదంకి : కనీస కూలి జిఒ నెంబర్ 73ను ప్రతి గ్రామంలో అమలయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు తాళ్లూరు మాల్యాద్రి డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన బ్రాహ్మణకాక గ్రామంలోని అరుంధతీయవాడ, హరిజనవాడలో కూలీలకు అవగాహన కల్పించారు. ఎకరా నారుమూడులకు రూ.7వేలు ఇవ్వాలని అవగాహన కల్పించారు. అధికారులు ప్రతి గ్రామంలో కనీస కూలి జిఒ చట్టం గురించి రైతులకు కూలీలకు వివరించాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలిపారు. కార్యక్రమంలో పి.భాస్కర్, వెంకటేశ్వర్లు, మహాలక్ష్మమ్మ దీనమ్మ, తదితరులు పాల్గొన్నారు.



బకాయిలు చెల్లించాలని వినతి

ప్రజాశక్తి-ఉదయగిరి : అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీలకు రావాల్సిన రిటైర్మెంట్ బెనిఫిట్స్, జీతాల బకాయిలు వెంటనే చెల్లించాలంటూ మంగళవారం కార్యాలయ సిబ్బందికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు ప్రాంతీయ కార్యదర్శి గడ్డం నాగేశ్వరరావు, కోడె రమణయ్య, రజియా మాట్లాడుతూ విధులు నిర్వహిస్తూ రిటైర్డ్ అయిన వారికి బెనిఫిట్స్ వెంటనే చెల్లించాలని, అలాగే మరి కొంతమంది సిబ్బందికి 11నెల వేతన బకాయిలు చెల్లించాలంటూ డిమాండ్ చేశామన్నారు. కార్యక్రమంలో ప్రమీల, తదితర కార్యకర్తలు పాల్గొన్నారు.

శ్మశాన స్థలం కేటాయించాలి

ప్రజాశక్తి-అనంతసాగరం

మండలంలోని గిరిజన కాలనీ ప్రజలకు శ్మశానస్థలం కేటాయించాలని, గిరిజన కాలని ఆధార్ కార్డులు లేని పిల్లలకు కొత్త కార్డు తీయడానికి బర్త్ సర్టిఫికెట్లు మంజూరు చేయాలనీ కోరుతూ ఆత్మకూరు ఆర్‌డిఒకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి అన్నప్రకాష్ మాట్లాడుతూ గిరిజన కాలనీ ప్రజలకు శ్మశాన స్థలం లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. కాలనీకి పక్కన ఉండే అటవీ ప్రాంతంలో ఖననం చేస్తున్నారని, అటవీ ప్రాంతం కావున అక్కడ ఖననం చేసుకోవడానికి ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కనుక ఎక్కడైనా ప్రభుత్వం వారు శ్మశాన స్థలం కేటాయించాలని కోరుతున్నామన్నారు. అలాగే గిరిజన కాలనీలో ఉండే చాలామంది పిల్లలకు ఆధార్ కార్డులు లేవని దాని వల్ల స్కూల్లకు, అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్లడానికి ఇబ్బందులు పడుతున్నారని, ఆధార్ కార్డులు కోసం బర్త్ సర్టిఫికెట్ అవసరం ఉందని, వారికి త్వరగా బర్త్ సర్టిఫికెట్లు మంజూరు చేయాలన్నారు. అలాగే గిరిజన కాలనీలో మంచి నీటి సరఫరా చేయాలని, అలాగే కరెంట్ కోసం ఐదు స్థంభాలు అవసరం ఉందని, స్థంభాలు వేసి విద్యుత్ సౌకర్యం కల్పించాలని, గిరిజన కాలనీవాసులకు సిమెంట్ రోడ్డులు వేయాలన్నారు. సమస్యలపై స్పందించిన ఆమె త్వరలోనే గిరిజనుల సమస్యలు పరిష్కారం చేస్తామన్నారు. సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు గంటా లక్ష్మీపతి, సిపిఎం మండల కమిటి సభ్యులు ఉప్పలపాడు మస్తాన్, సిఐటియు మండల అధ్యక్షులు మీరా మొహిద్దీన్, రహంతుల్లా, గిరిజన కాలనీ సిపిఎం శాఖ కార్యదర్శి వెంకటేష్, పార్టీ సభ్యులు అంకయ్య, మస్తాన్, రవి, రమేష్, తదితరులు పాల్గొన్నారు.



ఆర్‌డిఒతో మాట్లాడుతున్న సిపిఎం నాయకులు

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి-బిట్రగుంట : బోగోలు మండలం సముద్ర తీరప్రాంత మత్స్యకార ప్రజలు అప్రమత్తంగా ఉండాలని బోగోలు తహశీల్దార్ సురేష్‌బాబు పేర్కొన్నారు. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం తుఫాను భారీ వర్షాల నేపథ్యంలో మంగళవారం తహశీల్దార్ కార్యాలయంలో మండల అధికారులతో ఆయన సమావేశాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఇ.ఓ.పిఆర్‌డి, వ్యవసాయ అధికారి, డిప్యూటీ తహశీల్దార్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, అన్ని శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-దగదర్తి : వాతావరణ శాఖ భారీ వర్షాలు ఉన్నాయని చెప్పడంతో అధికారులు అప్రమత్తంగా ఉండాలని డిప్యూటీ తహశీల్దార్ జి.గిరీష్ అన్నారు. మంగళవారం మండలంలోని తహశీల్దార్ కార్యాలయంలో మండలస్థాయి అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. తుఫాన్ నేపథ్యంలో అధికారులందరూ ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. కార్యక్రమంలో మండలస్థాయి అధికారులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-సంగం : స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ సోమ్లా నాయక్ తుపాన్‌పై సిబ్బందితో సమావేశం నిర్వహించారు. తుపాన్ నేపథ్యంలో లోతట్టు ప్రాంతాలలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

రైతులకు వ్యవసాయ శాఖ సూచనలు

ప్రజాశక్తి-జలదంకి : మండల వ్యవసాయ అధికారిని బి.శైలజ ప్రస్తుత వాతావరణ పరిస్థితులపై సూచనలు బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో రానున్న మూడు రోజులపాటు దక్షిణ కోస్తా జిల్లాలలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ తెలిపిందని దానిని దృష్టిలో పెట్టుకొని రైతులు వ్యవసాయ శాఖ సూచనలు తప్పకుండా పాటించాలని తెలిపారు. 26, 27, 28 తేదీలలో పరిస్థితులను చూసుకుని నాట్లు వేయాలన్నారు. ప్రస్తుతం అకాల వర్షాల కారణంగా నారుమళ్లు పొలం నుంచి నీటిని బయటకు తీసే విధంగా రైతులు చర్యలు తీసుకోవాలన్నారు.



అందుబాటులో వైద్య సేవలు

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

24 గంటల పాటు ప్రజలకు వైద్య సేవలు అందుబాటులో ఉంటాయని ఆత్మకూరు అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ వైద్యులు డాక్టర్ అస్మా అన్నారు. వాతావరణ శాఖ సూచనల మేరకు జిల్లా కలెక్టర్, జిల్లా వైద్యాధికారి ఆదేశాల మేరకు జిల్లాకి 26వ తేదీ నుండి 28వ తేదీ వరకు భారీ వర్షాలు, ఈదురుగాలలో వీచే ప్రమాదం ఉండడంతో అందుకుగానూ వైద్య ఆరోగ్య శాఖ వారు తుఫాన్ బేసిక్ క్యాంప్ నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ ఆస్మా మాట్లాడుతూ ఆత్మకూరు పరిధిలోని మూడు టీములుగా ఏర్పడి యుపిహెచ్‌సి ఆత్మకూరులో 24 గంటలు వైద్య సేవలు అందిస్తారని తెలిపారు. మూడు టీములతో మెడికల్ ఆఫీసర్ వారి సిబ్బందితో కలిసి అందుబాటులో ఉంటారన్నారు. 24 గంటల హాస్పిటల్ తరచి ఉంటుందని తెలిపారు. లోతట్టు ప్రాంతాల్లో ఉన్న గర్భిణులు, ప్రసవించే గర్భిణులను డిహెచ్ ఆత్మకూరుకు 108 ద్వారా షిఫ్ట్ చేయాల్సిందిగా ఎఎన్ఎంలు, ఆశా వర్కర్లకు ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపిహెచ్ఇఒ ఎస్.సుధాకర్, ఎంపిహెచ్ఎస్ (ఎఫ్) ప్రశాంతి, ఎఎన్ఎంలు, ఆశా వర్కర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న సిఐ, ఎస్ఐ

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : 16వ వార్డులో నివసిస్తున్న షాన్‌వాజ్ గత కొంతకాలంగా ఊపిరితిత్తులు వ్యాధితో బాధపడుతున్న విషయం ఇటీవల పత్రికలలో కథనాలు రావడంతో ఆ విషయం తెలుసుకున్న ఆత్మకూరు సిఐ గంగాధర్ రావు, ఎస్ఐ జలాని భాషా మంగళవారం షాన్‌వాజ్ కుటుంబానికి వారివంతు సాయంగా రూ.9వేల ఆర్థికసాయాన్ని మున్నాకు అందజేశారు. వీరు చేసిన సహాయానికి షాన్‌వాజ్ కుటుంబ సభ్యులు సిఐ గంగాధర్ రావుకు, ఎస్ఐ జిలాని బాషాకు కృతజ్ఞతలు తెలియజేశారు.



పలుచోట్ల రాజ్యాంగ దినోత్సవ వేడుకలు



మర్రిపాడులో అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-మర్రిపాడు : రాజ్యాంగం ఆమోదించబడి 75 సంవత్సరాల పూర్తయిన సందర్భంగా మండలంలోని అన్ని పాఠశాలల్లో రాజ్యాంగ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలల్లో అంబేద్కర్ చిత్రపటానికి పూల మాలలేసి స్మరించుకున్నారు. చుంచులూరు ఉన్నత పాఠశాలలో భారత రాజ్యాంగంపై ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్ ఎంతగానో ఆకట్టుకుంది.

ప్రజాశక్తి-వరికుంటపాడు : మండలంలోని తిమ్మారెడ్డి పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. అంబేద్కర్ పుట్టినరోజు సందర్భంగా తొలుత డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి స్మరించుకున్నారు. అనంతరం విద్యార్థిని విద్యార్థులకు రాజ్యాంగాన్ని రచించిన విధానంపై వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులను అందజేశారు. మండల పరిషత్ కార్యాలయంలో రాజ్యాంగ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి షేక్.నాగూర్ వల్లి, జూనియర్ అసిస్టెంట్ రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-ఉదయగిరి : ఉదయగిరి పట్టణంలోని ఎంపిడిఒ కార్యాలయం వ్యవసాయ కళాశాలలో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్‌కు ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా కళాశాల డీన్ జి.కృష్ణారెడ్డి, ఇఒపిఆర్‌డి కరిముల్లా కార్యాలయ సిబ్బంది అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జాతీయ సేవా పథకం అధికారి డాక్టర్ దుర్గాప్రసాద్, సీనియర్ ప్రొఫెసర్ డాక్టర్ గోపీకృష్ణ, డాక్టర్ సునీత, డాక్టర్ కిషన్, డాక్టర్ అశోక్, విద్యార్థులు, ఎంపిడిఒ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ సమద్, జూనియర్ అసిస్టెంట్ నవాజ్, మండల ఎండి ఆపరేటర్ ఇమ్రాన్, రంగనాయకులు, బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాశక్తి-సంగంలోని ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల్లో రాజ్యాంగ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ సోమ్లా నాయక్, లైబ్రరీలో లైబ్రేరియన్ రవీంద్రారెడ్డి, హైస్కూల్‌ల్లో ఉపాధ్యాయులు అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలేసి నివాళులర్పించారు. అనం తరం అంబేద్కర్ జీవిత చరిత్ర గురించి వివరించారు. ప్రతిఒక్కరూ అంబేద్కర్ ఆశయాలను కొనసాగించాలని సూచించారు.

ప్రజాశక్తి-కావలి : అంబేద్కర్ రాజ్యాంగ ఫలాలు అట్టడుగు వర్గాలకు అందడం లేదని దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షులు ఎస్.మల్లి పేర్కొన్నారు. పట్టణంలోని గవర్నమెంట్ హాస్పిటల్ దగ్గర ఉన్న అంబేద్కర్‌కు విగ్రహానికి దళిత సంఘర్షణ సమితి ఆధ్వర్యంలో మంగళవారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంఆర్‌పిఎస్ నాయకులు జరుగుమల్లి విజయరత్నం, యానాది సంఘం నాయకుడు చౌటూరి లక్ష్మయ్య, దళిత నాయకుడు చెరుకూరి జనార్ధన్, సీనియర్ లాయర్ ఇస్కల సాయిప్రసాద్ అనేకమంది పాల్గొన్నారు.

జె. బి. లో. : జవహర్ భారతి డిగ్రీ కళాశాలలో మంగళవారం రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జవహర్ భారతి డిగ్రీకళాశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రాజ గోపాల్ రెడ్డిని ఆహ్వానించారు. కళాశాల ప్రిన్సిపాల్ పి.సుబ్రహ్మణ్యం నాయుడు, స్వయం ఉపాధి కోర్సుల డైరెక్టర్ డాక్టర్ ఆర్.మాల్యాద్రి, విశ్వోదయ రెక్టార్ డి.వినయ్ కుమార్ రెడ్డి, కళాశాల కరస్పాండెంట్ వి.సుధాకర్ రెడ్డి తదితరులున్నారు.

వైసిపి కార్యాలయంలో.. పట్టణంలోని వైసిపి కార్యాలయంలో మంగళవారం రాజ్యాంగ ఆమోద దినోత్సవం సందర్భంగా డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. పట్టణ నాయకులు కేతిరెడ్డి శివకుమార్ రెడ్డి, గంధం ప్రసన్నాంజనేయులు, గుడ్లూరు మాల్యాద్రి, దామిశెట్టి సుధీర్ నాయుడు, కనపర్తి రాజశేఖర్, కుందుర్తి శ్రీనివాసులు, మండలి కృష్ణారావు, కనమర్లపూడి వెంకట నారాయణ, పరుసు మాల్యాద్రి, కార్యకర్తలు పాల్గొన్నారు.

శ్రీ చైతన్య డిగ్రీ కళాశాలలో.. రాజ్యాంగ దినోత్సవ సందర్భంగా మంగళవారం శ్రీ చైతన్య డిగ్రీ కళాశాలలో రాజనీతి శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ పివి రావు, రాజనీతి శాస్త్ర విభాగ అధ్యక్షుడైన బి.మోహన్ రావు రాజ్యాంగం ప్రాధాన్యత, నియమ నిబంధనలను విద్యార్థులకు తెలియజేశారు. కార్యక్రమంలో న్యాక్ ప్రిన్సిపాల్ రవికాంత్, వాణిజ్య శాస్త్ర అధ్యాపకులు ఎస్‌కె రఫీ, అర్థశాస్త్ర అధ్యాపకులు కాంతారావు, మాధవరావు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ పి.వి.సాయితేజ పాల్గొన్నారు.


ఇందిరానగర్ మున్సిపల్ స్కూల్లో.. కావలి ఇందిరా నగర్ సర్వేపల్లి రాధాకృష్ణ మున్సిపల్ అప్పర్ ప్రైమరీ స్కూల్లో 75వ రాజ్యాంగం దినోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హ్యూమన్ రైట్స్ ఎపి ప్రెసిడెంట్ డాక్టర్ దారా శ్రీనివాస్, బిసి ఐక్యత రాష్ట్ర అధ్యక్షుడు అద్దంకి ప్రభాకర్, ప్రధాన కార్యదర్శి చిన్ని వరప్రసాద్ పాల్గొన్నారు. స్కూలు ప్రధానోపాధ్యాయురాలు సుగుణమ్మ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో డాక్టర్ దారా శ్రీనివాసులు మాట్లాడారు. కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు కె.కవిత, చాముండేశ్వరీ, ఉపాధ్యాయుడు జి.రేవంత్, ఎస్‌సి నాయకులు మస్తాన్, లక్ష్మణ్, మైనారిటీ నాయకుడు రజాక్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-బిట్రగుంట : భారత రాజ్యాంగం దినోత్సవం సందర్భంగా మంగళవారం బోగోలు బజారు సెంటర్లోని అంబేద్కర్ విగ్రహం వద్ద బోగోలు దళిత నాయకులు డాక్టర్ చంద్రశేఖర్, బత్తుల రవిచంద్ర, కుందుర్తి శ్రీనివాసులు, కట్టిపల్లి డాక్టర్ సింహాద్రి, ఎస్ మల్లి, బాబ్జి అంబేద్కర్ విగ్రహానికి పూలమాలేసి నివాళులర్పించారు.

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : రాజ్యాంగ రూపకల్పనకు డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ పాత్ర గొప్పదని పాఠశాల ప్రధానోపాధ్యాయులు కర్రా నాగేంద్ర అన్నారు. మంగళవారం రాజ్యాంగ దినోత్సవం పురస్కరించు కొని మున్సిపల్ బస్టాండ్ వద్ద విద్యార్థులతో కలిసి అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉపాధ్యాయురాలు మాలకొండమ్మ, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-బుచ్చిరెడ్డిపాలెం : బుచ్చిరెడ్డిపాలెం నగర పంచాయతీలోని రామచంద్రాపురం ప్రాథమికోన్నత పాఠశాలలో మంగళవారం రాజ్యాంగ దినోత్సవ వజ్రోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సేవా పురస్కార్ గ్రహీత గండికోట సుధీర్ కుమార్ మాట్లాడారు. ఉపాధ్యాయులు పి.నిర్మల, మున్వర్ అహ్మద్, వేణు, విజయ కుమారి, విద్యార్థులు పాల్గొన్నారు.

గిరిజన బాలుడికి వైద్యం



ప్రజాశక్తి-కావలి : కావలి పట్టణం, కాలేరు గుంట గిరిజన కాలనీలో గత 8 సంవత్సరాలుగా అనారోగ్యం కారణంగా మంచానికే పరిమితమైన బాలుడు మాకాని.శివయ్యకు సంయుక్త సేవాసంస్థ అభ్యర్థన మేరకు మంగళవారం కావలి శ్రీధర్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ వైద్యులు డాక్టర్ పి.శ్రీధర్, బాబుకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ పి.శ్రీధర్ మాట్లాడుతూ బాబుకి ఫిజియో థెరపీ చికిత్స చేయిస్తే చేతులు, కాల్లు పనిచేసే అవకాశం ఉంటుందని తెలిపారు. అలాగే ఎమ్.ఆర్.ఐ. స్కానింగ్ తీయిస్తే బాబు మెదడు పని తీరు ఎలా ఉందో తెలుస్తుందని, దానిని బట్టి తదుపరి వైద్యం చేయడం జరుగుతుందని తెలిపారు. సంయుక్త సేవాసంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సురేంద్ర ఆటోడ్రైవర్ అయినప్పటికీ అతను చేస్తున్న సేవలు అమోఘం అని తెలిపారు.


మాట్లాడుతున్న రూరల్ ఎంఎల్ఎ కోటంరెడ్డి

రూరల్ అభివృద్ధికి సమిష్టి కృషి

ప్రజాశక్తి-నెల్లూరు

రూరల్ నియోజకవర్గం అభివృద్ధికి నగరపాలక సంస్థ అన్ని విభాగాల అధికారులను సమన్వయం చేసుకుంటూ, సమిష్టిగా కృషి చేస్తామని రూరల్ నియోజకవర్గం శాసనసభ్యులు కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి తెలియజేశారు. మంగళవారం కార్పొరేషన్ కార్యాలయంలో రూరల్ నియోజకవర్గంలోని 26 డివిజన్‌లకు సంబంధించి అభివృద్ధి పనులు, ప్రజా సమస్యలపై కార్పొరేషన్ కమిషనర్ సూర్య తేజ, ఇతర అధికారులతో రూరల్ నియోజకవర్గ శాసన సభ్యులు సమీక్ష సమావేశం నిర్వహిం చారు. ఈ సందర్భంగా రూరల్ ఎంఎల్ఎ మాట్లాడుతూ రూరల్ నియోజకవర్గం పరిధిలో ఇంటిపన్నులను బలవంతంగా వసూలు చేయొద్దని సూచించారు. రూరల్‌కు సంబందించి అభివృద్ధి పనులపై, ప్రజా సమస్యలపై నెలకొకసారి సమీక్ష నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.


మాట్లాడుతున్న ఒమ్మిన సతీష్

29నుంచి ఎపి ఛాంబర్స్ బిజినెస్ ఎక్స్ పో

ప్రజాశక్తి-నెల్లూరు

ఆంధ్రప్రదేశ్ చాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈనెల 29 నుంచి 29 డిసెంబర్ 1వ తేదీ వరకు విజయవాడలోని ఎస్ ఎస్ కన్వెన్షన్ లో ఎపి ఛాంబర్స్ బిజినెస్ ఎక్స్ పో 2024'ని నిర్వహిస్తున్నట్లు ఎ పి చాంబర్ ఆఫ్ కామర్స్ రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ ఒమ్మిన సతీష్ తెలిపారు. మంగళవారం జిల్లా జర్నలిస్ట్ బండ్లు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వినూత్న స్థానిక ఉత్పత్తులను హైలైట్ చేస్తూ ఆంధ్రప్రదేశ్ అవకాశాలు ప్రదర్శించడం ఎక్స్పో లక్ష్యం అన్నారు.ఎక్స్పో జరిగే 3 రోజులూ సెమినార్లు నిర్వహిస్తున్నామన్నారు. సమావేశంలో కొండ శేఖర్ రెడ్డి, రవీంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న రమణారెడ్డి

కెఆర్‌పై అక్రమకేసులు కొట్టివేత

ప్రజాశక్తి-నెల్లూరు

ఎపిజిఇఎ రాష్ట్ర అధ్యక్షులు కె.ఆర్ సూర్యనారాయణపై గత ప్రభుత్వ హయాంలో నమోదైన పలు కేసులను కోర్టు కొట్టివేయడం సంతోషకరమని ఎపిజిఇఎ రాష్ట్ర ఉపాధ్యక్షులు వై.రమణారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం నగరంలోని ఏపిజిఈఏ జిల్లా కార్యాలయంలో 75 వ భారత రాజ్యాంగ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర ఉపాధ్యక్షుడు వై రమణారెడ్డి మాట్లాడారు.

రాజ్యాంగ స్ఫూర్తితో దేశాభివృద్ధికి కృషి


మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్


మాట్లాడుతున్న ఎం.భాస్కర్‌రావు

ప్రజాశక్తి-నెల్లూరు

ప్రపంచంలో అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంగా భారతదేశం నిలబడిందంటే దానికి కారణం భారత రాజ్యాంగమేనని, ప్రతిఒక్కరూ కూడా రాజ్యాంగ స్ఫూర్తితో దేశ అభివృద్ధికి తమ వంతు కృషి చేయాలని జాయింట్ కలెక్టర్ కే కార్తీక్ పిలుపు నిచ్చారు. మంగళవారం ఉదయం కలెక్టరేట్లోని ఎస్.ఆర్. శంకరన్ వీడియో కాన్ఫరెన్స్ హాల్లో భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా జాయింట్ కలెక్టర్ కార్తీక్ రాజ్యాంగ దినోత్సవ ప్రాధాన్యతను వివరి ంచి, అధికారులతో రాజ్యాంగ పీఠిక ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ భారతదేశ ప్రజలు స్వేచ్ఛా స్వాతంత్ర్యాలతో జీవించడానికి రాజ్యాంగం పీఠికలో పేర్కొన్న అంశాలే ప్రధాన కారణమని చెప్పారు.కార్యక్రమంలో డిఆర్ఒ ఉదయభాస్కర్, కలెక్టరేట్ పరిపాలనాధికారి విజయ్ కుమార్, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.


వెంకటాచలంలో

కొండాయ పాలెం ప్రాంతంలోని నగర పాలక ప్రాథమిక పాఠశాల లో రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు వక్తృత్వ పోటీలు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం భాస్కర్ రావు ఆధ్వర్యంలో నిర్వహి ంచారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా సమగ్ర శిక్షా అకడమిక్ మానిటరింగ్ అధికారి జి సుధీర్ బాబు, రూరల్ మండలం విద్యాధికారి ఆర్. మురళీ ధర్ విచ్చేసి అంబెద్కర్ చిత్ర పటానికి నివాళులు అర్పించి మాట్లాడారు.

ఎస్పి కార్యాలయంలో భారత రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరిం చుకుని భారత రాజ్యాంగ నిర్మాత, భారత రత్న డాక్టరు .బి.ఆర్.అంబేద్కర్ చిత్రప టానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎస్పి కృష్ణకాంత్ మాట్లాడారు.విద్యుత్ భవన్ లో విద్యుత్తు శాఖ సూపరింటెండింగ్ ఇంజనీర్ వి.విజయన్ రాజ్యాంగ రూపకల్ప డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చిత్రపటానికి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.కార్యక్రమంలో నగర ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎం.శ్రీధర్, అకౌంట్స్ ఆఫీసర్ విజిత, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ అల్తాఫ్, పర్సనల్ ఆఫీసర్ సురేష్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి-ఎఎస్‌పేట

మండల పరిధిలోని మండల అభివృద్ధి కార్యాలయంలో ఎంపిడిఒ ప్రసన్నకుమారి అధికారులు, సిబ్బందితో రాజ్యాంగ ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం రాజ్యాంగ దినోత్సవ శు భాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పరిపాలన అధికారి రేణుక, హౌసింగ్ ఏఈ, ఇంజనీరింగ్ అసిస్టెంట్, డిఇ హాజరయ్యారు.

ప్రజాశక్తి-వెంకటాచలం

మండలంలోని కంటేపల్లిలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి శు భాకాంక్షలు తెలియజేయడం జరిగింది. కార్యక్రమంలో రవికుమార్, రమేష్, నాగరాజు, శ్రీహరి, డబ్బుగుంట సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు

మండలంలోని సౌత్ ఆములూరు ప్రాథమికోన్నత పాఠశాలలో మంగళవారం 75వ భా రత రాజ్యాంగ దినోత్సవ వేడుకలు అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చిత్రపటా నికి నివాళులు అర్పించారు. అనం తరం పాఠశాల ప్రధానోపాధ్యాయులు షేక్ అహ్మద్ బాషా మాట్లాడారు.కార్యక్రమంలో పాఠశాల యాజమాన్య కమిటీ వైస్ చైర్మన్ వి.గిరిజకుమారి, పాఠశాల ఉపాధ్యా యులు కె.వసంత లక్ష్మి, కె. హెప్సీ, విద్యుల్లత పాల్గొన్నారు.

నిబంధనలు పాటించాలి

ప్రజాశక్తి-నెల్లూరు

సెప్టిక్ ట్యాంక్ క్లీనింగ్ వాహనాల నిర్వాహకులు నెల్లూరు నగరపాలక సంస్థ సూచించిన అన్ని నియమ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని కమిషనర్ సూర్య తేజ ఆదేశించారు. కార్పొరేషన్ కార్యాలయం కమాండ్ కంట్రోల్ సెంటర్ విభాగంలో మంగళవారం సెప్టిక్ ట్యాంక్ క్లీనింగ్ వాహనాల నిర్వాహకులకు వ్యర్థాల సేకరణ, రవాణా, విడుదలకు అనుమతులను మంజూరు చేస్తూ


లైసెన్సులను అందజేస్తున్న దృశ్యం

లైసెన్సులను అందించారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరపాలక సంస్థ పరిధిలోని 54 డివిజన్లలో సెప్టిక్ ట్యాంక్ క్లీనింగ్ వాహనాల ద్వారా సేకరించిన వ్యర్థాలను స్థానిక అల్లీపురం, హరనాధ పురం, వెంకటేశ్వరపురం ప్రాంతాలలోని మురుగు నీటి శుద్ధి కేంద్రాలలో మాత్రమే విడుదల చేయాలని ఆదేశించారు. ఆరుబయట పంట కాలువలు, నిర్జన ప్రదేశాలు, బహిరంగ ప్రదేశాలలో వ్యర్థాలను విడుదల చేస్తే చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిం చారు.కార్యక్రమంలో నగరపాలక సంస్థ ఇంజనీరింగ్ విభాగం ఎస్ఇ రామ్మో హన్ రావు, ఈ.ఈ. లు రహంతు జానీ, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చేయడం నేరం

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు

బాల్య వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని ఐసిడిఎస్ ఓ.రాజ్యలక్ష్మి స్పష్టం చేశారు. మంగళవారం మండలంలోని వరిగొండ-1 అంగన్వాడీ కేంద్రంలో బాల్య వివాహలపై అవగాహన కార్యక్రమం జరిగింది. అంగన్వాడీ సూపర్‌వైజర్ పి. రంగమ్మ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమం లో సీడీపీఓ రాజ్యలక్ష్మి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాన్ని ఒప్పందం చేసుకున్న వ్యక్తికి కఠిన కారాగార శిక్ష విధించబడుతుందని తెలిపారు. బాల్యవివాహాలను ఎవరు ప్రోత్సహించినా,


మాట్లాడుతున్న రాజ్యలక్ష్మీ

పెళ్లి చేసినా లక్ష రూపాయలు జరిమానా, మూడేళ్ల జైలు శిక్ష ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో పిహెచ్‌సి కృష్ణారెడ్డి, ఉప సర్పంచ్ హరికృష్ణ రెడ్డి, టి. వత్సలమ్మ, కె.పుష్ప, జి.సునీల్, వి.భవాని, ఎస్.కె షాన్వాజ్, కె.భార్గవి, ఎం.శ్రీ దేవి, గ్రామస్తులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కమిషనర్

విధుల్లో జాగ్రత్తలు తీసుకోవాలి

ప్రజాశక్తి-నెల్లూరు

భారీ వర్షాల నేపథ్యంలో నగరపాలక సంస్థ పరిధిలో విధులు నిర్వహిస్తున్న పారిశుధ్య కార్మికులు వాతావరణానికి తగ్గట్టుగా తగిన రక్షణ చర్యలను తీసుకోవాలని కమిషనర్ సూర్య తేజ సూచించారు. పారిశుధ్య పనుల పర్యవేక్షణ లో భాగంగా మంగళవారం స్థానిక పొదలకూరు రోడ్డు, డైకస్ రోడ్డు, గాంధీనగర్ తదితర ప్రాంతాల్లోని మస్టర్ పాయింట్లను కమిషనర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కార్మికులతో కమిషనర్ మాట్లాడుతూ కార్మికులంతా రెయిన్ కోట్లు, విజబుల్ జాకెట్లు ధరించి విధులు నిర్వహించాలని సూచించారు.కార్యక్రమంలో ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ చైతన్య, శానిటేషన్ సూపర్‌వైజర్లు, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్లు, సచివాలయ శానిటేషన్ సెక్రటరీలు పాల్గొన్నారు.


రక్తనమూనాలను సేకరిస్తున్న దృశ్యం

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

ప్రజాశక్తి-విడవలూరు

మండల పరిధిలోని అన్నారెడ్డి పాలెం గ్రామంలో గ్రామస్తులకు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని జ్వరం పీడితులకు వైద్యం నిర్వహిస్తూ తమ వంతు సహాయ సహకారాలు అందిస్తున్న వైద్య సిబ్బంది ఝూన్సీ వైద్య సిబ్బంది సహకారంతో గ్రామస్తులకు ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలంటూ రక్తనమూ నాలు సేకరించారు. ప్రతి ఇల్లు తనిఖీ చేస్తూ ఎక్కడ నీరు నిల్వ ఉండకుండా వాటిలో లార్వాను గుర్తించి పారబోయించారు. నీటి తొట్టెలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని పరిసర ప్రాంతాలలో నీరు నిల్వ ఉండకుండా తొలగించాలని సూచించారు. ఆమెతోపాటు వైద్య సిబ్బంది పాల్గొన్నారు

ఇంటింటి సర్వేకు ప్రతి ఒక్కరూ సహకరించండి

ప్రజాశక్తి-నెల్లూరు

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు సంబంధించిన అన్ని సంక్షేమ పథకాలు నగరపాలక సంస్థ వార్డు సచివాలయాల అన్ని పౌర సేవలు, ఇసుక బుకింగ్ చేసుకొనుటకు తదితర అన్ని సేవలను పొందేందుకు ఇంటింటి సర్వే తప్పనిసరి అని, సర్వే నిర్వహిస్తున్న సచివాలయ కార్యదర్శులకు ప్రతి ఒక్కరూ సహకరిం చాలని కమిషనర్ సూర్య తేజ మంగళవారం ఒక ప్రకటనలో సూచించారు. గౌరవ రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యుల ఆదేశాల మేరకు ప్రజలంతా హౌస్ హోల్డ్ సర్వేలో తమ ఇంటిని మ్యాపింగ్ చేసుకోవాలని కమిషనర్ సూచించారు. ఇప్పటివరకు 65 శాతం హౌస్ హోల్డ్ మ్యాపింగ్ జరిగిందని మిగిలిన 35 శాతం కూడా పూర్తయ్యేలా ప్రజలంతా సహకరిం చాలని కమిషనర్ ఆకాంక్షించారు.